
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
గురువారం 11 జనవరి 2024 | 5





సభలో చంద్రబాబు అభివాదం

విజయం మనదే!


విల్లును ఎక్కుపెట్టిన చంద్రబాబు

- రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే
- వైసీపీ అరాచకాలకు ప్రజలు ముగింపు పలకడం ఖాయం
- కాకినాడ జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేస్తా
- ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నంతోపాటు ఎత్తిపోతల పథకాలను బాగుచేస్తా
- తునిలో రా..కదలిరా బహిరంగ సభలో టీడీపీ అధినేత చంద్రబాబు
- జిల్లాలో వైసీపీ ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబు, దాడిశెట్టి రాజా అవినీతిపై ధ్వజం
- మంచితనానికి, మర్యాదలకు తూర్పుగోదావరి పెట్టింది పేరని కొనియాడిన చంద్రబాబు
- తుని సభకు వేలల్లో జనం పోటెత్తడంతో చంద్రబాబు ఉబ్బితబ్బిబ్బు

"వైసీపీ అరాచకాలతో ప్రజలు విసుగెత్తిపోయారు. ఆ పార్టీకి బుద్ధి చెప్పడానికి ఎప్పుడు ఎన్నికలు వస్తాయా అని ఎదురుచూస్తున్నారు. రాబోయేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే" అని టీడీపీ అధినేత చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. జిల్లాను పారిశ్రామికంగా, పర్యాటకంగా అభివృద్ధి చేసి పూర్వవైభవం తెచ్చే బాధ్యత తాను తీసుకుంటానన్నారు. తునిలో బుధవారం నిర్వహించిన రా..కదలి రా!.. సభలో పాల్గొని చంద్రబాబు గంటన్నరసేపు ప్రసంగించారు. సాయంత్రం 4.15 గంటలకు హెలీకాప్టర్‌లో తునికి చేరుకున్న చంద్రబాబు 5.15 గంటలకు సభా వేదికపైకి వచ్చారు. అప్పటికే వేలల్లో హాజరైన జనాన్ని చూసి ఉబ్బితబ్బిబ్బయ్యారు. జన సందోహాన్ని చూస్తుంటే టీడీపీ గెలుపు కనిపిస్తోందన్నారు. చెంతనే ఉన్న సముద్రం పొంగిందా అన్న తరహాలో వచ్చిన జనాలను చూస్తే చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా గొప్పదనాన్ని చంద్రబాబు వివరించారు. తూర్పుగోదావరి జిల్లా అంటే మంచితనానికి, మర్యాదలకు పెట్టింది పేరు అని కొనియాడారు. అలాగే వైసీపీ నేతల అరాచకాలను మరోసారి ఆయన ఎండగట్టారు. జిల్లాలో ప్రజలందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు చెప్పిన చంద్రబాబు.. సంప్రదాయాలకు చిహ్నమైన కోడి పందాలకు ఏర్పాట్లు సిద్ధమయ్యాయని, అయితే హద్దుల్లో ఉంటూనే ఆడుకోవాలని సరదాగా సూచించారు.

కాకినాడ(ఆంధ్రజ్యోతి)/తుని రూరల్, జనవరి 10 :

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ముగ్గురు ఎమ్మెల్యేలకు, ఓ మంత్రికి సీట్లు మార్చిన జగన్.. కాకినాడ సిటీ, కొత్తపేట, అనపర్తి ఎమ్మెల్యేలను ఎందుకు మార్చరని చంద్రబాబు ధ్వజమెత్తారు. మంత్రి దాడిశెట్టి రాజా, ఎమ్మెల్యేలు ద్వారంపూడి, కన్నబాబుల అవినీతిపై విరుచుకుపడ్డారు. బుధవారం తునిలో నిర్వహించిన రా..కదలి రా..! సభకు వేలల్లో జనం హాజరవడంతో అంతా పసుపుమయం అయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తరలివచ్చిన నేతలు, కార్యకర్తలతో పండగ వాతావరణం సంతరించుకుంది. సాయంత్రం 5.15కు చంద్రబాబు బహిరంగ సభ వేదికపైకి రాగానే చప్పట్లు, కేరింతలతో టీడీపీ, జనసేన నేతలు, కేడర్ స్వాగతం పలికారు. వేలల్లో హాజరైన జనాలను చూసిన చంద్రబాబు ఆప్యాయతలకు జిల్లా మారుపేరు అని కొనియాడారు. నీతినిజాయితీకి జిల్లా పెట్టింది పేరన్నారు. పౌరుషంగా ఒక్కమాట కూడా మాట్లాడరని అన్నారు. మంచినీళ్లు ఇస్తే కొబ్బరి నీళ్లు ఇక్కడి ప్రజలు ఇస్తారన్నారు. చెంతనే అన్నవరంలో నిత్యం పూజలు, వ్రతాలతో ఈ ప్రాంతం మార్మోగుతుందని వివరించారు. వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయారని, మంత్రి దాడిశెట్టి రాజా అక్రమాల రాజా అని ధ్వజమెత్తారు. అక్రమ సంపాదనతో ఒకచోట 132 ఎకరాలు, మరోచోట రౌతులపూడిలో 72 ఎకరాలు కొన్నారన్నారు. ఇలాంటి వసూలు రాజా అయిన మంత్రి రాజా ఎందుకు టిక్కెట్ మార్పే విషయంలో కనబడలేదని జగన్‌ను ప్రశ్నించారు. మరో ఎమ్మెల్యే ద్వారంపూడి అవినీతికి ద్వారాలు తెరిచారని, దందాల్లో ఈయన హీరో అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌ను నోటికివచ్చినట్టు తిట్టడంలో ద్వారంపూడి మీరిపోయాడన్నారు. ఇలాంటి నేతలు తిన్నదంతా తిరిగి కక్కిస్తానని హెచ్చరించారు. జగన్‌కు ద్వారంపూడి బినామీ అని, బియ్యంలో ఈయన కోట్లు గడించారన్నారు. జిల్లాలో ఏ అవినీతి జరిగినా దీనికి కేంద్ర బిందువు ద్వారంపూడేనన్నారు. ఎమ్మెల్యే కన్నబాబు మెక్కడంలో స్పీడ్‌గా ఉన్నారని, ఒకప్పుడు ఈయన జగన్‌ను తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టి ఇప్పుడు తెగ పొడుగుతున్నారన్నారు. బతకనేర్చిన కన్నబాబు అవినీతిలో లెక్కలేనంతగా సంపాదించాడని ఆరోపించారు. జగ్గంపేట, ప్రత్తిపాడు, పిఠాపురం ఎమ్మెల్యేలను జగన్ మార్చేశారని, ఓ మంత్రిని జిల్లా దాటించేశారన్నారు. ప్రజలు కూడా సీఎం జగన్‌ను ఇంటికి పంపించడం ఖాయం అన్నారు. వైసీపీ పాలనలో జిల్లా సాగునీటి రంగం తీవ్రంగా దెబ్బతిందని ధ్వజమెత్తారు. టీడీపీ వచ్చాక ఏలేరు ఆధునికీకరణ, పురుషోత్తపట్నం, ఎత్తిపోతల పథకాలను తిరిగి గాడినపెడతామని ప్రకటించారు. జిల్లాలో సముద్రజల కాలుష్యంపై మత్స్యకారులు ఫిర్యాదుచేశారని, ఆ సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో తీరంతో పాటు సెజ్, రెండు పోర్టులు ఉన్నాయని, పెట్రోకాంప్లెక్స్ కూడా వస్తే పారిశ్రామికంగా వృద్ధి చెందుతుందన్నారు. పర్యాటకరంగాన్ని కూడా ప్రోత్సహించి జిల్లాకు పూర్వవైభవం తెస్తానన్నారు. కాగా చంద్రబాబుకు టీడీపీ నేతలు వెండి గద, బాణం అందించారు. కార్యక్రమంలో మాజీ మంత్రులు యనమల రామకృష్ణుడు, బండారు సత్యనారాయణ, రాజప్ప, గొల్లపల్లి, ఎమ్మెల్యే గోరంట్ల, మాజీ ఎమ్మెల్యేలు నెహ్రూ, వనమాడి, వర్మ, రామకృష్ణారెడ్డి, వంగలపూడి అనిత, బండారు సత్యానందం, దాట్ల బుచ్చిబాబు, పిల్లి అనంతలక్ష్మి, జిల్లా పార్టీ అధ్యక్షుడు నవీన్, ప్రత్తిపాడు, తుని, రాజానగరం ఇన్‌చార్జులు వరుపుల సత్యప్రభ, దివ్య, బొడ్డు వెంకటరమణ, మాజీ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, అమలాపురం నియోజకవర్గ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు, మండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, కటకంశెట్టి బాబి, పేరాబత్తుల రాజశేఖర్, వాసిరెడ్డి ఏసు దాసు, టీడీపీ సీనియర్ నేత గుణ్ణం చంద్రమౌళిలు పాల్గొన్నారు.

మూడు నెలల్లో దశ, దిశ చూపిస్తాం

సూర్యుడు తూర్పున ఉదయించి ఏ విధంగా అందరికీ వెలుగునిస్తాడో.. అలా టీడీపీ, జనసేన కూడా మూడు నెలల్లో ప్రభుత్వ బాధ్యత తీసుకుని దశ, దిశ చూపిస్తామని చంద్రబాబు స్పష్టంచేశారు. ఒక విజనరీ ఉండాలి. ఆ రోజుల్లో కాటన్.. ధవళేశ్వరం బ్యారేజీ కట్టాడు. అతడు విదేశీయుడైనా గోదావరి జిలాల్లో ఏ మూలకు వెళ్లినా ఆయన విగ్రహాలు పెట్టారు. అదీ మీ మంచితనం. మీకు మేలు చేస్తే అలా చూసుకుంటారు. కానీ ఇక్కడ వైసీపీ నేతలు మెక్కిందంతా కక్కిస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హెచ్చరించారు. కాగా జగన్ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన మోసపూరిత హామీల వీడియోను సభా వేదికపై భారీ స్క్రీన్‌పై చంద్రబాబు ప్రదర్శించారు. మద్య నిషేధం చేస్తానని, సీపీఎస్ వారంలోనే రద్దు చేస్తానని, ప్రత్యేక హోదా తీసుకువస్తానని, పోలవరం 2021, 2022, 2023, 2025కల్లా పూర్తిచేస్తానని జగన్ ప్రసంగాలను ప్రదర్శించి.. బాబు ప్రశ్నల వర్షం కురిపించారు. జై చంద్రబాబు, జై పవన్‌కల్యాణ్.. సైకో పోవాలి సైకిల్ రావాలంటూ సభా ప్రాంగణం నినాదాలతో హోరెత్తింది. బాబు ప్రసంగానికి కార్యకర్తలు ఉత్సాహంతో స్పందించారు.


బాబుకు స్వాగతం పలుకుతున్న వంగలపూడి అనిత, యనమల, రాజప్ప


బహిరంగ సభలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న చంద్రబాబు


సభలో బొకే అందిస్తున్న కాకినాడ మాజీ మేయర్ సుంకర పావని


సభలో చంద్రబాబుతో రాజేష్ మహాసేన, మాజీ ఎమ్మెల్సీ చిక్కాల






తునిలో జరిగిన రా.. కదలి రా..! బహిరంగ సభకు హాజరైన అశేష జనావళి.. సభలో వేదికపై మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జులు, ఇతర నేతలు ఉన్న దృశ్యం

రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో వెనక్కి నెట్టిన జగన్

వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి ఉంది. టీడీపీ పాలనలో దేశంలో రాష్ట్రం అభివృద్ధి మొదటి 5 స్థానాల్లో ఉండగా వైసీపీలో చివరి 5 స్థానాల్లోకి దిగజారింది. రాష్ట్రంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా సంపదను సృష్టించి రాష్ట్రాన్ని గాడినపెట్టగల సమర్థుడు చంద్రబాబు. భవిష్యత్ తరాలకు టీడీపీ, జనసేన ప్రభుత్వం ఎంతో అవసరం.

- యనమల రామకృష్ణుడు, రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యుడు



బటన్‌నొక్కి జగన్‌ను ఇంటికి పంపిద్దాం

జనాలను మోసం చేస్తున్న జగన్‌ను ఈవీఎం బటన్ నొక్కి ఇంటికి పంపిద్దాం. రాష్ట్ర ప్రజలు టీడీపీ, జనసేన విజయాన్ని కోరుకుంటున్నారు. ఇరుపార్టీల మైత్రితో ఘన విజయం సాధిస్తాం.

- నిమ్మకాయల చినరాజప్ప, పెద్దాపురం ఎమ్మెల్యే

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటం

జనసేన, టీడీపీ సంయుక్త పోరాటంతోనే వైసీపీ ఓటమి సాధ్యం. 45 వసంతాల రాజకీయ చరిత్ర.. ఉమ్మడి రాష్ట్రంలో సుదీర్ఘకాలం సీఎంగా పనిచేసిన చంద్రబాబుకు, మంచి స్టార్డమ్ ఉన్న జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌లకు పదవులు ముఖ్యంకాదు.. రాష్ట్ర ప్రజల సంక్షేమం, శ్రేయస్సు కోసమే ఇరుపార్టీలు ఒక్కటయ్యాయి. రాష్ట్ర సైకో పాలనను అంతం చేసేందుకు చంద్రబాబు, పవన్ కలయిక తప్పనిసరి. రాష్ట్ర భవిష్యత్ కోసమే జనసేన అధినేత పొత్తు పెట్టుకున్నారు. ఇరుపార్టీలు సమన్వయంతో పనిచేసి సుపరిపాలనకు నాంది పలుకుదాం.

- కందుల దుర్గేష్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జనసేన ఇన్‌చార్జి

కప్పగంతులతో నిరసన

డీఈవో కార్యాలయం ఎదుట 22వ రోజుకు సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె

ముమ్మిడివరం, జనవరి 10: సమగ్ర శిక్షా ఉద్యోగుల సమ్మె బుధవారం 22వ రోజుకు చేరుకుంది. ముమ్మిడివరంలోని జిల్లా విద్యా శాఖ కార్యాలయం ఎదుట కాంట్రాక్టు ఉద్యోగులు కప్పగంతులు వేస్తూ నిరసన తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, హెచ్‌ఆర్‌ఏ, డీఏ అమలు చేసి వేతనాలు పెంచాలని, రూ.10లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్, గ్రాడ్యుటీ కల్పించాలని, ఈపీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని వారు నినాదాలు చేశారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, సీఆర్ఎంటీలు, ఐఈఆర్టీలు, అకౌంటెంట్లు, పీటీఐలు, మెసెంజర్లు పాల్గొన్నారు. ఎస్టీయూ, యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈవో అసోసియేషన్, జీహెచ్ఎం అసోసియేషన్, పీడీ, పీఈటీ అసోసియేషన్, అంగన్‌వాడీ యూనియన్ కార్మికులు, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు. శిబిరంలో సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.శ్రీనుబాబు, జిల్లా కార్యదర్శి ఎస్.వెంకట్, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ల సంఘం అధ్యక్షుడు కె.వెంకటేశ్వరరావు, ఐఈఆర్టీల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, రిసోర్సుపర్సన్ల సంఘం డివిజన్ అధ్యక్షుడు నాగన్న, కంప్యూటర్ ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




ఎంపిక పత్రాన్ని స్వీకరిస్తున్న కాశ్యప్

జొన్నాడ నుంచి జాతీయ స్థాయికి

క్రికెట్ అండర్-17 పోటీలకు ఎంపికైన కాశ్యప్

ఆలమూరు, జనవరి 10: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురంలో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అండర్-17 విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం జొన్నాడకు చెందిన పెద్దింటి నరసింహ కాశ్యప్ విశేష ప్రతిభ కనబరిచాడు. దీంతో అతడిని బిహార్‌లో జరిగే జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక చేశారు. మండపేటలోని శశి జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న కాశ్యప్‌ను ప్రిన్సిపల్ రవికుమార్, అధ్యాపకులు, మండపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.నాగకుమార్, వ్యాయమ ఉపాధ్యాయుడు చొప్పల చంద్రశేఖర్, తోట రవిచంద్రమౌళి, పోతుల ధర్మశేఖర్, జొన్నాడ నాయకులు ద్వారంపూడి దొరబాబు, తాడి శ్రీనివాసరెడ్డి, కట్టా శ్రీనివాస్, నాంద్ర నాగమోహన్‌రెడ్డి, ఆదిత్యారెడ్డి తదితరులు అభినందించారు.

ప్రపంచంలో ఉపాధి అవకాశాల సమాచారానికి ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ ప్రారంభం

అమలాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఉద్యోగ, ఉపాధి అవకాశాల సమాచారాన్ని తెలుసుకునేందుకు ఆన్‌లైన్ ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్ వెబ్‌సైట్ పోర్టల్‌ను జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ ప్రారంభించారు. బుధవారం కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 10వ తరగతి నుంచి డిగ్రీ, డిప్లొమా పూర్తిచేసిన వారు ఈ పోర్టల్‌లో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. లాగిన్ ద్వారా ఎంప్లాయిమెంట్ కార్డును డౌన్లోడ్ చేసుకునే సదుపాయం కల్పించామన్నారు. జిల్లా ఉపాధి కల్పనాధికారిణి యి.వసంతలక్ష్మి మాట్లాడుతూ ఇంజనీరింగ్, ఎంబీఏ, డిగ్రీ కోర్సులు సహా టెక్నికల్ రంగాలకు యువత ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ఈ పోర్టల్‌ను రూపొందించారన్నారు. మరిన్ని వివరాలకు 8121838392 నెంబరును సంప్రదించాలని సూచించారు. డీఆర్వో సీహెచ్ సత్తిబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కేజీ బేసిన్ ద్వారా అధిక మొత్తంలో ఉత్పత్తులు

ఓఎన్జీసీ ఈడీ అమిత్ నారాయణ్



అల్లవరం, జనవరి 10: కృష్ణా-గోదావరి బేసిన్ పరిధిలో చమురు, సహజవాయివు ఉత్పత్తులు గణనీయంగా పెరగడంతో దేశంలోనే అగ్రగామిగా నిలిచిందని ఓఎన్జీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అమిత్‌నారాయణ్ పేర్కొన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరానికి బుధవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఓఎన్జీసీ కేజీ బేసిన్ అధిక ఉత్పత్తుల సాధనపై ప్రధాని నరేంద్రమోదీ అభినందించారన్నారు. ఈస్ట్రన్ ఆఫ్‌షోర్ బావుల నుంచి అత్యధిక ఉత్పత్తులు సాధిస్తూ గడిచిన ఇరవై ఏళ్లలో అగ్రస్థానంలో నిలిచిందని, తద్వారా దేశానికి డొమెస్టిక్ గ్యాస్ పది శాతం దాటి అందిస్తున్నామన్నారు. కోనసీమ జిల్లా తాటిపాక రిఫైనరీ, నాగాయిలంక నుంచి 60 శాతం ఉత్పత్తులు సాధించడం గర్వకారణమన్నారు. ఆన్‌షోర్ బావుల ద్వారా రోజుకు 650 టన్నుల క్రూడాయిల్, 21 లక్షల క్యూబిక్ మీటర్ల గ్యాస్ ఉత్పత్తి జరుగుతోందన్నారు. ఈ ఏడాది చివరికి ఇది 750 టన్నులకు పెరుగుతుందన్నారు. తమ కార్యకలాపాల ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు ఏడాదికి రూ.600 కోట్లు రాయల్టీగా చెల్లిస్తున్నామన్నారు. సీఎస్ఆర్ నిధులతో పలు సదుపాయలు కల్పిస్తున్నామన్నారు. ఓఎన్జీసీ రాజమహేంద్రవరం ఎసెట్ చమురు ఉత్పత్తుల్లో అగ్రగామిగా నిలిచి సీఎస్ఆర్ నిధులు ఎక్కువగా ఇచ్చేస్థాయికి చేరుకుందని ఈడీ అమిత్‌నారాయణ చెప్పారు.

జైళ్లశాఖ డీఐజీ ప్రత్యేక పూజలు



స్వాగతం పలుకుతున్న పండితులు

అన్నవరం, జనవరి 10 : రత్నగిరిపై కొలువు దీరిన సత్యదేవుడి సన్నిధిలో బుధవారం జైళ్లశాఖ డీఐజీ రవికిరణ్ కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఏపీఆర్వో ఎం.గణపతిరావు తదితరులున్నారు.

తప్పించుకుని తిరుగుతున్న నేరస్థుల అరెస్టు



గంజాయి(ఫైల్)

జగ్గంపేట, జనవరి 10: జగ్గంపేట పోలీస్ సర్కిల్ పరిధిలోని కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన ఒక గంజాయి రవాణా కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేశామని, మరో ముగ్గురు కోసం గాలిస్తున్నట్లు జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావు తెలిపారు. జగ్గంపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2021 డిసెంబరులో విశాఖపట్నం ఏజెన్సీలో గల ధారకొండ గ్రామం నుంచి మహారాష్ట్రకు 152 ప్యాకెట్లతో ఉన్న 750 కిలోల గంజాయిని తరలిస్తున్న స్కార్పియో వాహనం కత్తిపూడి వద్ద పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నంలో పలు దారులలో తిప్పితిప్పి చివరకు కిర్లంపూడి మండలం తామరాడ వద్ద ఏటిగట్టున గంజాయి ప్యాకెట్లుతో వదిలేశారని తెలిపారు. పోలీసులను నుంచి తప్పించుకునే ప్రయత్నంలో తమ వాహనంతో స్కూటీపై వెళుతున్న ఒక వ్యక్తిని గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో ఢీ కొట్టడంతో అతను మృతి చెందాడని తెలిపారు. ఈ కేసు అప్పట్లో సంచలనం అయిందన్నారు. దీనికి సంబంధించి నిందితులు, అప్పటి నుంచి తప్పించుకుని తిరుగుతున్నారని తెలిపారు. మంగళవారం కృష్ణవరం టోల్‌గేట్ వద్ద నిర్వహించిన తనిఖీలలో ఈ కేసులో ప్రధాన నిందితులు హనుమాన్ మెహిత్(27), సమీర్ సుధాకర్ గవాంది (29)లను గుర్తించి కిర్లంపూడి పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇదే ముఠాకు చెందిన అతుల్ ఓంకార్, సంజయ్ పాండురంగ, ఉమేష్, టాకిరే కోసం గాలిస్తున్నట్లు తెలిపారు.

రైతులకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి

రాజమహేంద్రవరం అర్బన్, జనవరి 10 : రైతులకు ప్రతినెలా రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని రైతులకు ఏదైనా సమస్య వస్తే రైతులందరూ ఏకమై ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని, రైతులకు వ్యతిరేకంగా ఏదైనా చట్టాలు తీసుకొస్తే ఊరుకునేది లేదని ప్రభుత్వాన్ని రైతు సంఘం తరపున హెచ్చరించారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు జరిగిన ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర మహాసభలు బుధవారంతో ముగిశాయి. 35 తీర్మానాలను సభ ఆమోదించింది. ఈ సందర్భంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా పి.రామచంద్రయ్య, అధ్యక్షుడిగా జి.ఈశ్వరయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏ.కాటమయ్య, ప్రధాన కార్యదర్శిగా కేవీవీ ప్రసాద్, కార్యదర్శి, కోశాధికారిగా వలవలపూడి రాములను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఎ.రామానాయుడు, వి.హనుమారెడ్డి, ఎం.యల్లమందరావు, కార్యవర్గ సభ్యులుగా డేగా ప్రభాకర్, కె.జగన్నాథం, వి.జమలయ్య, సి.మల్లికార్జున, బుడితి అప్పలనాయుడులతో కూడిన 21 మంది కార్యవర్గం, 58 మందితో సమితిని ఎన్నుకున్నారు. భూ యాజమాన్య హక్కుల చట్టం 2023ను రద్దు చేయాలని, కౌలు రైతుల చట్టాన్ని సవరించి సులభంగా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని, రైతుల ఆత్మహత్యలు అరికట్టే రుణ ఉపశమన చట్టాన్ని తీసుకురావాలని సాగునీటి ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేయాలని, పోలవరం ముంపు ప్రజలను ఆదుకోవాలని, ఆక్వా రైతులకు రాయితీలు ఇవ్వాలని తదితర తీర్మానాలు చేశారు.

కారు ధ్వంసం..తప్పిన ప్రమాదం





యానాం, జనవరి 10: యానాం నియోజకవర్గంలోని ఫెర్రీ రోడ్డులో బీచ్ ప్రధాన రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కారు నుజ్జునుజ్జు కాగా యువకులు ప్రమాదం నుంచి బయటపడ్డారు. మచిలీపట్నానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో ఉండి శివలింగాల నుంచి ఎన్‌ఇసీ జెట్టీ వద్దకు ఓవర్‌స్పీడ్‌లో వచ్చి అటుగా వెళుతున్న కొంత మందిని తప్పించబోయి పక్కనే ఉన్న కరెంట్‌పోల్‌ను ఢీకొట్టారు. దీంతో కారు ముందు భాగం పూర్తిగా పాడై చక్రాలు విరిగిపోయాయి. ఆ సమయంలో కారులో ఉన్న ఇద్దరు సీటు బెల్టులు పెట్టుకుని ఉండటంతో బెలూన్స్ ఓపెన్ అవ్వడంతో ప్రాణాలతో బయటపట్టారు. ఈ సంఘటనలో ప్రాణనష్టం జరిగినప్పటికి కారు నుజ్జునుజ్జయ్యింది. విషయం తెలుసుకున్న యానాం ట్రాఫిక్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని యువకులతో మాట్లాడి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కిక్ బాక్సింగ్ ఎంపికలు



నిడదవోలు, జనవరి 10: నిడదవోలు పట్టణంలోని ఎస్వీఆర్కే డిగ్రీ కళాశాలలో బుధవారం ఆదికవి నన్నయ విశ్వ విద్యాలయం స్థాయిలో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులకు కిక్ బాక్సింగ్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో ఎంపికైన క్రీడాకారులు జాతీయ విశ్వ విద్యాలయాల స్థాయి టోర్నమెంటులో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతి తెలిపారు. ఈ పోటీలలో ఎం.రవి (ఎస్వీఆర్కే నిడదవోలు), బి.అర్జున్ (ఆదిత్య డిగ్రీ కాలేజ్ రాజమహేంద్రవరం), బి.ప్రవీణ్ కుమార్ (డీఆర్కే డిగ్రీ కాలేజ్, గొల్లల మామిడాడ), సీహెచ్ వెంకట్ (పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ), బి.రవితేజ, (వీఎస్ఎమ్ డిగ్రీ కాలేజ్, రామచంద్రపురం), పి.ధనుష్ (పీఆర్ గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, కాకినాడ), సీహెచ్ దినేష్ (గవర్నమెంటు డిగ్రీ కాలేజ్, రాజోలు) క్రీడాకారులు ఎంపికయ్యారు.

భారీ భోగి దండ



ఆలమూరు, జనవరి 10: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరులో భారీ భోగి దండను తయారు చేశారు. 2019లో కిలోమీటరున్నర దండను తయారు చేసి రికార్డు సృష్టించారు. కొవిడ్ సమయంలో రెండేళ్లు సాధారణ దండలను తయారు చేశారు. గతేడాది కిలోమీటరు పొడవు రూపొందించారు. ఈ సంవత్సరం 600 మీటర్ల దండ తయారు చేశారు. ఉరదాలమ్మ ఆలయ కమిటీ ఛైర్మన్ ఈదల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆవుపేడను చింతలూరు, గుమ్మిలేరు గ్రామాల నుంచి సేకరించి మహిళలు దీనిని తయారు చేశారు. భోగి పండుగ నాడు భారీ ఊరేగింపు నిర్వహించి భోగి మంటలో వేస్తామని నిర్వాహకులు చెప్పారు.

తునిలో టీడీపీ ప్రభంజనం

- రా కదలిరా సభకు తండోపతండాలుగా జనం
- మధ్యాహ్నం 12 గంటల నుంచే బాబు కోసం ఎదురుచూపులు



వేదికపై చంద్రబాబు, నాయకులు

తుని రూరల్, జనవరి 10: తునిలో టీడీపీ 'రా కదలిరా' సభ సూపర్ సక్సెస్ అయ్యింది. పార్టీ శ్రేణులు, అభిమానులు తండోపతండాలుగా తరలిరావడంతో నాయకుల ఆనందానికి అవధుల్లేవు. ఊహించని విధంగా జనప్రవాహం పోటెత్తడంతో తెగ సంబరపడిపోతున్నారు. సభా ప్రాంగణమంతా పసుపు మయంగా మారింది. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపు అందుకున్న కార్యకర్తలు ఉప్పెనలా తరలివచ్చారు. మధ్యాహ్నం 12 గంటల నుంచే చంద్రబాబు ప్రసంగం కోసం ప్రజలు వేసి ఉండటం విశేషం. ఎక్కడ చూసినా పసుపు బ్యానర్లు, పసుపు తోరణాలు ఆకర్షించాయి. సభా వేదికకు కార్యకర్తలు తరలివచ్చే ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన టీడీపీ పార్టీ ఆర్చ్‌లు ఆకట్టుకున్నాయి. చామవరం శివారు ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి రోడ్డు మార్గం గుండా చంద్రబాబు సభాస్థలికి చేరుకునే మార్గంలో వేలాదిగా తరలివచ్చిన ప్రజలకు చంద్రబాబు అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. టీడీపీ ఇన్‌చార్జ్ యనమల దివ్య, జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు యనమల శివరామకృష్ణన్ గజమాలతో స్వాగతం పలికారు. ఆయన సభా వేదికకు చేరగానే ఈలలు, కేకలు, చప్పట్లతో పరిసరాలు మారుమోగాయి. మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు కుమారుడు చింతకాయల విజయ్ చంద్రబాబుకు ధనస్సు బహుకరించగా, రాజమండ్రికి చెందిన మీసాల రాజు గదను అందజేశారు.

వైసీపీని గద్దె దించేందుకు సిద్ధం కావాలి

యనమల దివ్య, తుని టీడీపీ ఇన్‌చార్జ్

వైసీపీని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉండాలని తుని టీడీపీ ఇన్‌చార్జి యనమల దివ్య తెలిపారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో 'రా కదలిరా' సభ రెట్టించిన ఉత్సాహం నింపినట్లు చెప్పారు. టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడితే బీసీలకు రక్షణ చట్టం, మహిళలకు సూపర్ సిక్స్ పథకాలు అమలవుతాయని, పేద, మధ్యతరగతి ప్రజల జీవితాల్లో జనసేన, టీడీపీ ప్రభుత్వం వెలుగులు నింపుతుందన్నారు.

సాగునీటి కాలువలు నిర్వీర్యం అయ్యాయి

ఎస్వీఎస్ఎన్ వర్మ, పిఠాపురం ఇన్‌చార్జి

సైకో జగన్ పాలనలో సాగునీటి కాలువలు నిర్వీర్యం అయ్యాయని ఫలితంగా రైతులు దెబ్బతిన్నారని వర్మ ధ్వజమెత్తారు. చంద్రబాబు పాలనలో రూ.1650 కోట్లతో పురుషోత్తపట్నం ప్రాజెక్టు అందుబాటులోకి తీసుకొస్తే వైసీపీ ప్రభుత్వం దాని నిర్వహణ చూడలేని పరిస్థితిలో ఉందన్నారు. రైతులు అమ్ముకున్న ధాన్యానికి డబ్బులు ఇవ్వలేక తుఫాన్ ప్రభావంతో నష్టపోయిన రైతులను ఆదుకోక రైతులు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు.

కౌరవ సభను గౌరవంగా మార్చాలి

జ్యోతుల నవీన్‌కుమార్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు

రాష్ట్రంలో సైకో పాలన నడుస్తుందని ప్రజల కోసం అవమానాలు, నిర్బంధాలు భరించి ప్రజా శ్రేయస్సు కోసం తపిస్తున్న చంద్రబాబుకు అండగా నిలుద్దామని జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ తెలిపారు. రాష్ట్రంలో సైకో పాలన ఉందని, అసెంబ్లీ కౌరవసభను తలపిస్తుందని దీన్ని గౌరవ సభగా మార్చేందుకు కాకినాడ పార్లమెంట్ పరిధిలో 7 నియోజకవర్గాల్లో టీడీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకుందామని తెలిపారు.

అరాచక పాలనకు కాలం చెల్లింది

యనమల కృష్ణుడు, రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ

అవినీతి అక్రమాలు, అరాచకాలతో పేట్రేగిపోతున్న వైసీపీ పాలనకు కాలం చెల్లిందని రాష్ట్ర టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రటరీ యనమల కృష్ణుడు తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాలను మోసం చేసింది వైసీపీ ప్రభుత్వమేనని, అభివృద్ధి సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యమని భావితరాల భవిష్యత్ టీడీపీ, జనసేనతో ముడిపడి ఉందన్నారు.

అడ్డగోలు హామీలతో రాష్ట్ర ప్రజలకు అష్టకష్టాలు

వనమాడి కొండబాబు,కాకినాడ సిటీ టీడీపీ ఇన్‌చార్జ్

అడ్డగోలు హామీలతో రాష్ట్ర ప్రజలను తప్పుదోవ పట్టించింది ముఖ్యమంత్రి జగన్ అని కాకినాడ సిటీ టీడీపీ ఇన్‌చార్జ్ వనమాడి కొండబాబు అన్నారు. అందువల్ల ఈరోజు అంగన్‌వాడీలు, ఒప్పంద కార్మికులు, ఉపాధ్యాయులు రోడ్డెక్కిన పరిస్థితులు దాపురించాయన్నారు. సమస్యలు పరిష్కరించలేని జగన్ ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురి చేసే చర్యలకు పూనుకుందన్నారు. రాష్ట్రానికి పెట్టుబడి చంద్రబాబు అని ఆయనను కాపాడుకునే బాధ్యత అందరిపైన ఉందన్నారు.

కాటన్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్



అవార్డు ప్రదానం చేస్తున్న చైతన్యరాజు

రాజానగరం, జనవరి 10 : గోదావరి డెల్టా రూపశిల్పి సర్ ఆర్థర్ కాటన్‌ను నేటి యువ ఇంజనీర్లు ఆదర్శంగా తీసుకోవాలని కామన్వెల్త్ నేషన్స్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ పిలుపునిచ్చారు. గైట్ ఇంజనీరింగ్ కళాశాలను బుధవారం ఆమె సందర్శించారు. చైతన్య విద్యా సంస్థల వ్యవస్థాపకుడు కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు) అధ్యక్షతన జరిగిన సమావేశంలో పేట్రీషియా స్కాట్లాండ్‌కు గైట్ కళాశాల నుంచి సర్ ఆర్థర్ కాటన్ ఇన్నోవేషన్ అవార్డ్-2023ను చైతన్యరాజు, ఎండీ శశికిరణ్‌వర్మ అందజేశారు. చైతన్య విద్యాసంస్థల ద్వారా ప్రతీ ఏటా 100 కామన్వెల్త్ స్కాలర్‌షిప్స్ ఇచ్చేందుకు సంసిద్ధంగా ఉన్నామని చైతన్యరాజు, శశికిరణ్‌వర్మ ప్రకటించారు. దీని ద్వారా కామన్వెల్త్‌లోని 56 దేశాలకు చెందిన మెరిట్ విద్యార్థులు చైతన్య విద్యాసంస్థల్లో విద్యనభ్యసించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాటన్ మేనకోడలు, కామన్వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రామైఖేల్ గ్రేస్, సెక్రటరీ జనరల్ కార్యాలయ అధికారులు, ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, సునీల్ చంద్రరామ్, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గార్‌ఉడ్ సెంటర్ ఫర్ కార్పొరేట్ ఇన్నోవేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, మేఘాలయ ప్రభుత్వ ప్రిన్సిపాల్ కార్యదర్శి సంపత్‌కుమార్, బెంగళూరు క్రిస్ట్ యూనివర్సిటీ ప్రొఫెసర్ సాజివర్గీస్, రొమానియా ఏఐ ఎక్స్‌ఫర్ట్ సాబిన్‌డామా, స్మార్ట్ విలేజెస్ డైరెక్టర్ వైఎస్ మైఖేల్, రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ తేజ్ భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి, రాజానగరం తహశీల్దార్ పవన్‌కుమార్, సీఐ పి.కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

మ్యూజియం సందర్శన

.రాజమహేంద్రవరం రూరల్, జనవరి 10: చారిత్రాత్మక కాటన్ మ్యూజియాన్ని కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ పాట్రిసియా స్కాట్లాండ్ సందర్శించారు. తూర్పుగోదావరి జిల్లాకు వచ్చిన ఆమె బుధవారం నేరుగా ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్దకు చేరుకున్నారు. అక్కడ ఆమెకు జిల్లా జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్, ఆర్డీవో చైత్రవర్షిణి తదితర ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఆమె కాటన్ మ్యూజియంలో బ్యారేజీ నమూనాలు, గోదావరి ప్రవాహ స్వరూపాన్ని పరిశీలించారు. అనంతరం కాటన్‌దొర జీవిత విశేషాలు, బ్యారేజీ చారిత్రక నేపథ్యాలను ఇరిగేషన్ అధికారులు ఎస్ఈ జి.శ్రీనివాసరావు, డీఈ కాశీవిశ్వేశ్వరరావు నుంచి ఆమె తెలుసుకున్నారు. కాటన్ బ్యారేజీకి ఐక్యరాజ్య సమితి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు ఇచ్చినట్టు జాయింట్ కలెక్టర్ తేజ్‌భరత్ వివరించారు. ఈ సందర్భంగా పాట్రిసియా స్కాట్లాండ్ మాట్లాడుతూ చారిత్రక కలిగిన చిత్తరువులు వీక్షించడం తనకు ప్రత్యేక అనుభూతి కలిగిందన్నారు. ఆమె వెంట కాటన్ మేనకోడలు, కామన్వెల్త్ సెక్రటేరియట్ చీఫ్ డెబ్రామైఖేల్ గ్రేస్, ఎస్డీజీ ఇంప్లిమెంటేషన్ కార్యాలయ ప్రత్యేక ప్రతినిధి ప్రొఫెసర్ ప్రజాపతి ద్వివేది, బర్కిలీలోని యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా గార్ ఉడ్ సెంటర్ ఫర్ కార్పొరేట్ ఇన్నోవేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రొఫెసర్ సాల్మన్ డార్విన్, కేంద్ర యువజన విభాగం, కామన్వెల్త్ సెక్రటేరియేట్ సునీల్ చంద్‌రామ్, గైట్ ఛైర్మన్ కేవీ సత్యనారాయణరాజు, వైస్ ఛైర్మన్ కే శశికిరణ్‌వర్మ, ఎస్ఈజీ శ్రీనివాసరావు, డీఈ ఆర్.కాశీవిశ్వేశ్వరరావు, తహశీల్దార్ పి.చిన్నారావు ఉన్నారు.

కారు ఢీకొని వీఆర్ఏ దుర్మరణం



రాజానగరం, జనవరి 10: గోకవరం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వర్తిస్తున్న కొల్లాటి ప్రసాద్ (40) బుధవారం రాత్రి కారు ఢీకొనడంతో మరణించారు. రాజానగరంలో నివాసం ఉంటున్న ప్రసాద్ విధి నిర్వహణలో భాగంగా గోకవరం వెళ్లి మోటార్ సైకిల్‌పై ఇంటికి తిరిగి వస్తున్నాడు. మార్గమధ్యంలో రాజానగరం మండలం నందరాడ సమీపానికి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న ఇండికా కారు ప్రసాద్‌ను బలంగా ఢీకొన్నది. వీఆర్ఏ హెల్మెట్ ధరించినప్పటికీ తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ మేరకు రాజానగరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జైలు దాడి కేసులో ఒక్కొక్కరికి ఏడేళ్ల జైలు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ షణ్ముగం

యానాం, జనవరి 10: యానాంలో సంచలనం కలిగించిన జైలు దాడి కేసులో పుదుచ్చేరి కోర్టు తీర్పు వెలువరించింది. ఈ కేసులో దోషులుగా ఉన్న 12 మందికి 7 సంవత్సరాలు జైలు శిక్ష విధించినట్లు యానాం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షణ్ముగం చెప్పారు. తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో వివరాలను వెల్లడించారు. పుదుచ్చేరిలో కరుడుకట్టిన నేరస్తుడు మణికంఠన్‌ను హత్య చేసేందుకు పుదుచ్చేరి నుంచి ప్లాన్ అమలు చేశారు. పుదుచ్చేరి జైలులో ఉన్న మణికంఠన్‌కు ప్రాణహాని ఉందని గ్రహించిన జైలు అధికారులు 2013లో భారీ భద్రతతో పుదుచ్చేరి నుంచి యానాం జైలుకు తరలించారు. యానాం జైలులో ఉన్న నేరస్తుడు మణికంఠన్‌ను హత్య చేసేందుకు 2013 ఆగస్టు 29న 18 మంది సభ్యులు బృందం యానాం జైలులోకి గోడ దూకి ప్రవేశించారు. ఆ సమయంలో అక్కడ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణం స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మూడు బృందాలుగా విడిపోయిన పోలీసులు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటనపై అప్పటికే ఎస్ఐ, ప్రస్తుతం సీఐగా ఉన్న షణ్ముగం చార్జిషీటు దాఖలు చేశారు. ఈ కేసులో నిందితులుగా ఉన్న వారిలో ఇద్దరు మృతి చెందగా మరో నలుగురిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో మిగిలిన 12 మందిపై (పుదుచ్చేరికి చెందిన వారు) అభియోగాలు రుజువు కావడంతో వారికి పుదుచ్చేరి న్యాయస్థానం 7 సంవత్సరాలు జైలుశిక్ష విధించింది. దీంతో వీరిని పుదుచ్చేరిలోని కాలపేట జైలుకు తరలించనున్నారని సీఐ షణ్ముగం, ఎస్ఐ శేరు నూకరాజు తెలిపారు.

నూతన నమూనాలయం భారీ స్థాయిలో అవసరం లేదు



సాంకేతిక సలహాదారుకు చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నవరం, జనవరి 10: జాతీయ రహదారిపై నూతనంగా నిర్మిస్తున్న నమూనాలయం అంత భారీస్థాయిలో కట్టనవసరం లేదని దేవదాయశాఖ సాంకేతిక సలహాదారు కొండలరావు పేర్కొన్నారు. దేవస్థానం ఈవో రామచంద్రమోహన్ అభ్యర్థన మేరకు బుధవారం రత్నగిరికి విచ్చేసి ఆజాద్ హయాంలో తీర్చిదిద్దిన రోడ్లను పరిశీలించారు. వనదుర్గ ఆలయం, మల్టీలెవెల్ కారు పార్కింగ్ తీర్చిదిద్దిన రోడ్డు, సీఆర్వో కార్యాలయం వద్ద నుంచి కొండ దిగువుకు ఏర్పాటు చేసిన రోడ్డును పరిశీలించారు. ఈ రోడ్డుకు మరో పక్క రక్షణగోడ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. అదే విధంగా పలుచోట్ల లోతు ఉండడంతో దానిని గ్రావెల్‌తో పూడ్చాల్సిన అవసరముందని అన్నారు. ఈ పరిశీలనపై లిఖితపూర్వక నివేదికను అందజేస్తామని దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులకు తెలియజేశారు. ముందుగా సత్యదేవుడిని దర్శించిన ఆయనకు ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం అందజేయగా దేవస్థానం ఈఈ నరసింహారెడ్డి స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. సాంకేతిక సలహాదారు వెంట చీఫ్ ఇంజనీర్ శ్రీనివాసరావు ఉన్నారు.

సమ్మె బాటలో ఫీల్డ్ అసిస్టెంట్లు?

- 18కల్లా డిమాండ్లు పరిష్కరించకుంటే 19 నుంచి సమ్మె తప్పదని హెచ్చరిక



కూలీల హాజరు వేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు(ఫైల్)

మండపేట, జనవరి 10: ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్లు సమ్మె బాట పట్టేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 18కల్లా డిమాండర్లు పరిష్కరించకుంటే 19 నుంచి సమ్మె తప్పదని వారు అంటున్నారు. గత పదేళ్ల నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న వారికి సమాన పనికి సమాన వేతనం రూ.26000లు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లను బదిలీ చేయాలని, ప్రతిఏటా 7500 పని దినాలు విధానం రద్దు చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ప్రస్తుతం తమకు ప్రభుత్వం చెల్లిస్తున్న కనీస వేతనం రూ.5500 స్థానంలో రూ.26000 పెంచి వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికే తమ సమస్యలపై ఈ నెల 4న అమరావతిలో ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకున్నామని చెప్పారు. అయితే ఈ నెల18 కల్లా ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యను పరిష్కరిస్తామని అధికారులు ఇచ్చిన హామీ నెరవేరకుంటే తాము కూడా ఈనెల 19 నుంచి సమ్మె బాట పడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 22 మండలాల్లో సుమారు 300 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు.

సొమ్మసిల్లి పడిపోయిన అంగన్వాడీ వర్కర్



సపర్యలు చేస్తున్న వర్కర్లు

రాజవొమ్మంగి జనవరి 10: రాజవొమ్మంగిలో బుధవారం అంగన్వాడీ వర్కర్లు 30వ రోజు నిరవధిక సమ్మెలో భాగంగా ఆర్అండ్‌బీ అతిథి గృహ సమీపంలో దీక్ష శిబిరం వద్ద నిరసన చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం లాగరాయి -1 అంగన్వాడీ టీచర్ కె.మంగ సొమ్మసిల్లి పడిపోవడంతో తోటి అంగన్వాడీ వర్కర్లు వెంటనే స్పందించి సపర్యలు చేశారు. అంగన్వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.నిర్మల మాట్లాడుతూ ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం దిగిరాక తప్పదన్నారు.

21వ రోజుకు రిలే దీక్షలు

అమలాపురం టౌన్, జనవరి 10:రాష్ట్రప్రభుత్వం తీసుకువచ్చిన భూ హక్కు చట్టాన్ని రద్దు చేయాలని డిమాండుచేస్తూ అమలాపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన రిలేదీక్షలు బుధవారం 21వరోజుకు చేరుకున్నాయి. ప్రజల ఆస్తులకు రక్షణ లేని చట్టాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. దీక్షలో ఐఏఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ ఆజామ్, సీహెచ్అజయ్ కుమార్, అబ్బిరెడ్డి సురేష్, బడుగు భాస్కరజోగేష్, ఎన్.కృష్ణమూర్తి, హమీద్ పాషా, పి.సుబ్రహ్మణ్యం, ఎన్.శ్రీనివాసరావు, పి.తమ్మేశ్వరరావు పాలొగన్నారు.

రసాయన కాలుష్యంతో రోగాల బారిన పడుతున్నాం

ఆర్డీవోకు సమస్యలు విన్నవించిన ఎస్.యానాం వాసులు



గ్రామస్తులతో చర్చిస్తున్న ఆర్డీవో కేశవర్ధనరెడ్డి

ఉప్పలగుప్తం, జనవరి 10: రసాయన కాలుష్యంతో ఉదర కోశ, చర్మ, ఊపిరితిత్తుల వ్యాధులతో రోగాలబారిన పడుతున్న తమను రవ్వ యాజమాన్యం దశాబ్దాల తరబడి పట్టించుకోకుండా ఆదాయం పెంపుపైనే దృష్టి సారించిందని ఎస్.యానాం ప్రజలు అమలాపురం ఆర్డీవో కేశవర్ధనరెడ్డి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. ఈనెల5న గ్రామాభివృద్ధి, ఉపాధి కల్పన డిమాండ్లతో యువత ఆందోళనచేసిన నేపథ్యంలో 'రవ్వ' ఆధ్వర్యంలో గ్రామంలో జరిగిన అభివృద్ధిని క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు శుక్రవారం ఆయన గ్రామానికి వచ్చారు. చేసిన అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి రవ్వ యాజమాన్యం సమర్పించిన నివేదికతో, క్షేత్రస్థాయిలో జరిగిన పనులను ఆర్డీవో సరిచూసే చర్యలు చేపట్టారు. తమకు కనీసం ఆరోగ్య బీమా అమలు చెయ్యట్లేదని, వైద్య పరీక్షలకు వేలకువేలు ఖర్చుపెట్టలేక నానాపాట్లు పడుతున్నామని ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీని దశాబ్దాలు గడిచినా అమలుచెయ్యలేదన్నారు. పక్కా గృహాల నిర్మాణంలో ప్రభుత్వ రుణానికి తోడుగా గతంలో ప్లాంటు యాజమాన్యం ఇచ్చే ఆర్థిక సహాయం నిలిపివేశారని నిరుపేదలు వాపోయారు. కాగా ప్రజల సమస్యలను, గ్రామంలో అభివృద్ధిని పరిశీలించిన ఆర్డీవో గురువారం మరోసారి సమావేశం నిర్వహిస్తానని చెప్పారు. సర్పంచ్ జోగి రాజేశ్వరీరాజా, ఎంపీటీసీ పెట్టా అప్పారావు, రేవు తిరుపతిరావు, తహసీల్దారు జవ్వాది వెంకటేశ్వరి, ఎంపీడీవో కేఏస్ గౌరీకుమారి, గ్రామ పెద్దలు, 'రవ్వ' ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పారిశుధ్య కార్మికుల సమ్మె

అమలాపురం టౌన్, జనవరి 10: సమస్యల పరిష్కారానికి పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం 15వ రోజుకు చేరుకుంది. అమలాపురం మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ, సీఐటీయూ, జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మె శిబిరానికి పలు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. ఏఐటీయూసీ ప్రతినిధులు కొప్పుల బాబి, నిమ్మకాయల శ్రీను, కె.వెంకట్రావు, ఎన్.నాగార్జున, మీసాల మంగ, జంగా రామయమ్మ, పి.సాయమ్మ, సీఐటీయూ నుంచి టి.గోపి, పి.కోటేశ్వరరావు, ఎన్.మూర్తి, డి.శ్రీను, ఎ.దుర్గాప్రసాద్, వరలక్ష్మి తదితరులు దీక్షలో పాల్గొన్నారు.

ముమ్మిడివరం: నగర పంచాయతీ అవుట్ సోర్సింగ్ ఇంజనీరింగ్ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి 16వ రోజుకు చేరుకుంది. నగర పంచాయతీ కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన దీక్షా శిబిరం వద్ద రోడ్డు మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పాదయాత్రలో జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని వారు డిమాండు చేశారు. సీఐటీయూ నాయకుడు జి.దుర్గా ప్రసాద్ శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. సమ్మె శిబిరంలో ఎం.శ్రీనివాసరావు, ఎస్.అరుణ్‌కుమార్, వి.వెంకటేశ్వర్లు, ఎస్.అజయ్‌కుమార్, జి.రమేష్, ఎస్.వెంకటేష్, వైరమణ, కె.శివ, కె.గోవిం దరాజు, కె.శరత్, వి.ప్రసాద్, ఎస్.రామరాజు, కె.జార్జి, ఎన్.బొజ్జమ్మ పాల్గొన్నారు.

ఓడలరేవు బీవీసీలో సంక్రాంతి సంబరాలు

అల్లవరం, జనవరి 10: హరిదాసుకీర్తనలు...భోగిమంటలు... సంప్రదాయ వస్త్రధారణలు... రంగవల్లులు... విద్యార్థుల నృత్య ప్రదర్శనలతో ఓడలరేవు బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు మిన్నంటాయి. విద్యార్థిని, విద్యా ర్థులు సందడి చేశారు. గరగనృత్యాలు, గంగిరెద్దుల విన్యా సాలు, ముస్తాబు, కేరళ డప్పు వాయిద్యాలు, కోలాటాలు, పిండి వంటలు మరింత శోభ తెచ్చాయి. కళాశాల సెక్రటరీ బోనం కనకయ్య, ఛైర్మన్ బోనం కృష్ణసతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ వీఏఎస్ఏ చంద్రమౌళి, డాక్టర్ టీవీ జనార్దనరావు, టీచర్లుపాల్గొన్నారు.



అమలాపురం టౌన్: పట్టణంలోని భాష్యం పాఠశాల ప్రాంగణంలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో కనువిందు చేశారు. జానపద కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల తల్లులకు నిర్వహించిన రంగవల్లుల పోటీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలు పోటీల్లో విజేతలకు జోనల్ ఇన్‌చార్జి జవ్వాది వెంకటశ్రీనివాస్ బహుమతులు అందజేశారు. భోగి మంటలు, బొమ్మల కొలువు కనువిందు చేశాయి. ప్రిన్సిపాల్ సీహెచ్ రవి, చాంప్స్ ఇన్‌చార్జి కె.నాగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: విశ్వేశ్వరాయపురం, మలికిపురం, బట్టేలంక తదితర ప్రాంతాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. భోగిమంటలు, రంగవల్లులు వేశారు. పలు రకాల పిండి వంటలు ప్రదర్శించారు.

పేకాట క్లబ్ నిర్వహణపై ఫిర్యాదు

యానాం, జనవరి 10: యానాంలో పేకాట క్లబ్ నిర్వహణలో లంచాల తీరుపై పుదుచ్చేరి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాజీవ్ వేర్మకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు వినతిపత్రం అందజేశారు. తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. యానాంలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కేంద్రం ఆధీనంలోని స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా(సాయి)సెంటర్‌కు స్థలం కేటాయించి టెండర్ పిలవకపోతే, ఇక్కడ నుంచి వేరేచోటకి తరలివెళ్లిపోతుందన్నారు.

రిటైర్మెంట్ వయసు 62ఏళ్లకు పెంచాలి

రాజోలు, జనవరి 10: డీఎస్సీ 1998మినిమం టైమ్ స్కేలు ఉపాధ్యాయులకు రిటైర్మెంట్ 62ఏళ్లకు పెంచాలని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి కోటిపల్లి రాంబాబు కోరారు. శివకోటిలో బుధవారం ఏర్పాటుచేసిన ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. ఆర్డర్లు తీసుకున్నమూడు నెలల నుంచి రిటై ర్మెంట్ అవుతున్నారన్నారు. రిటైర్మెంట్ వయసు పెంచాల న్నారు. నేరెళ్ల సత్యనారాయణ, టీవీవీసత్యనారాయణ, కె.మూర్తి, డీవీసత్యనారాయణ, ఎం.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం



కొత్తపేట, జనవరి 10: కొత్తపేట విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల 1981-84 బ్యాచ్ డిగ్రీ విద్యార్థులు స్థానిక కాపు కల్యాణ మండపంలో బుధవారం ఆత్మీయంగా కలుసుకున్నారు. అప్పటి సహచర విద్యార్థి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆయన అప్పటి సంగతులను గుర్తుచేసుకుంటూ జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం విందు భోజనాలు ఏర్పాటు చేశారు. ముత్యాల బాబ్జీ, వీధి భాస్కర్, సిద్ధివినాయక శ్రీను, శేర్ మంగిలాల్, కొత్త బుజ్జిరాజు, కోటిపల్లి సత్యనారాయణ, గంధం భాస్కరరావు పాల్గొన్నారు.

ఇరవై ఏళ్ల క్రితం పన్నులే ఇప్పటికీ వసూలు

● మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్నారు: ఎమ్మెల్సీ
● ఆక్రమణలు తెలియకుండా పన్నులెలా వేస్తారు
● వాడివేడిగా మున్సిపల్ సమావేశం

అమలాపురం టౌన్, జనవరి 10: పురపాలక సంఘంలో ఇరవై ఏళ్ల క్రితం వేసిన పన్నులనే ఇప్పటికీ వసూలు చేయడం ఏమిటని అధికారపక్ష కౌన్సిలర్ చిట్టూరి పెదబాబు ప్రశ్నించారు. సాధారణ సినిమాహాలును రీమోడల్ చేసి రెండు ఏసీ థియేటర్లగా మార్చినా పన్నులు పెరగవా... సినిమాహాళ్ల పన్ను బకాయిలు ఉండడం ఏమిటని ప్రశ్నించారు. పట్టణంలో షాపింగ్ మాల్స్ పెరిగాయి... బహుళ అంతస్తుల భవనాలు ఎన్నో నిర్మించారు... వాటికిపన్నులు ఎలావేస్తున్నారని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ప్రశ్నించారు. ఒక షాపింగ్ మాల్‌లో కింద గొడౌన్ ఉందని, పైన రెసిడెన్షియల్ అని, పన్నులు తగ్గించి మున్సిపల్ ఆదాయానికి గండికొడుతున్న అధికారుల తీరును అధికారపక్ష కౌన్సిలర్ మట్టపర్తి నాగేంద్ర తీవ్రంగా దుయ్యబట్టారు. పన్నులు సక్రమంగా వేయట్లేదని, వసూళ్లు అంతంత మాత్రంగానే ఉంటున్నాయని మండిపడ్డారు. అధికారపక్ష కౌన్సిలర్లే అధికారుల తీరును తప్పు పడుతూ అమలాపురం పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి అధ్యక్షతన బుధవారం వాడివేడిగా జరిగింది. పట్టణంలో పబ్లిసిటీ ట్యాక్స్ ఏళ్ల తరబడి ఒకే విధంగా ఉంటోందని, వాటి సమాచారం అడిగినా చెప్పట్లేదని సభ్యులు మండిపడ్డారు. పట్టణం నిండా ఎటుచూసినా హోర్డింగులే దర్శనమిస్తున్నాయి. కానీవాటికి పన్నులు మాత్రం ఉండవు. గాలివాన వచ్చినప్పుడు జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని నాగేంద్ర ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలంలో బహుళ అంతస్తుల భవనం నిర్మిస్తే పురపాలక సంఘం నుంచి పన్ను ఎలా వేస్తారని, రేపు ఆ భవనం నాదే అంటే ఎవరు బాధ్యత వహిస్తారని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మండిపడ్డారు. పట్టణంలో విద్యా వ్యాపారం సాగిస్తున్న ప్రైవేటు కళాశాలలు, కార్పొరేట్ కళాశాలలు, ప్రైవేటు పాఠశాలల నుంచి వసూలుచేసే పన్నుల విధానంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. కమిషనరు వి.అయ్యప్పనాయుడు కల్పించుకుని పన్నులు వేయడం, వసూళ్లు తదితర అంశాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని వివరించడంతో సభ్యులు శాంతించారు. పట్టణంలో ఆక్రమణలు ఎన్నిఉన్నాయని కౌన్సిలర్ గొవ్వాల రాజేష్ ప్రశ్నించారు. ఆక్రమణలు ఎన్ని ఉన్నా యో తెలియకుండా పన్నులు ఎలా వేస్తున్నారని మండి పడ్డారు. ఆక్రమణల పూర్తి సమాచారం అందించాలని డిమాం డు చేశారు. భవన నిర్మాణాలకు వందలాది ప్లాన్ అప్రూ వల్‌లు ఇస్తున్నారు కానీ పదుల సంఖ్యలో మాత్రమే ఆయా భవనాలకు పన్నులు వేసే విధానాన్ని సంవత్సరాల వారీగా లెక్కలను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు బయట పెట్టడంతో టౌన్ ప్లానింగ్ అధికారులు నీళ్లు నమిలారు. తొలుత అత్యవసర సమావేశానికి సంబంధించి ఎజెండా ప్రతులను సభ్యులకు అందించని తీరుపై జనసేన కౌన్సిలర్లు యేడిద శ్రీను, పిండి అమరావతి, గండి దేవిహారిక ప్రశ్నిం చారు. పట్టణంలో నెలకొన్న సమస్యలను అధికార, విపక్ష కౌన్సిలర్లు దొంగ నాగసుధారాణి, తిక్కా సత్యలక్ష్మి అధికారుల ముందుంచారు. గతంలో పట్టణంలో అభివృద్ధికి సంబంధించి 30పనులను పురపాలక సంఘం ఆమోదించగా వాటిని చేపట్టేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రానున్నందున వాటిని రద్దుచేసి తిరిగి టెండర్లు పిలిచేందుకు ఆమోదించారు.



కౌన్సిల్ సమావేశంలో అధికార, విపక్ష కౌన్సిలర్ల వాగ్వివాదం, ఛైర్‌పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి

రూ.2.80కోట్ల మిగులు బడ్జెట్..

2023-24 సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.13,62,73,482 కాగా ఆదాయం రూ.43,12,54,000, ఖర్చు రూ.51,39,37,000 పోను రూ.5,05,90,482 నిల్వ చూపించారు. 2024-25 సంవత్సరానికి ప్రారంభ నిల్వ రూ.5.05 కోట్లు, ఆదాయం రూ.46.04 కోట్లు, ఖర్చు రూ.48.29కోట్లు కాగా రూ.2.80కోట్ల మిగులు బడ్జెట్‌ను సమావేశం ఏకగ్రీవంగా ఆమోదించింది.

నెత్తిన కుర్చీలతో అంగన్‌వాడీల నిరసన



ముమ్మిడివరం: తలపై కుర్చీలు పెట్టుకుని అంగన్‌వాడీల నిరసన

ముమ్మిడివరం, జనవరి 10: డిమాండ్లపరిష్కారం కోరుతూ అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీలు,ఆయాలు ముమ్మిడివరంప్రాజెక్టు కార్యాలయం ఎదుట ఏర్పాటుచేసిన సమ్మె శిబిరంలో కుర్చీలు తలపై పెట్టుకుని నిరసన తెలిపారు. కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఉద్యోగభద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు జి.దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీల డిమాండ్లను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తుందన్నారు. ఎం.జయలక్ష్మి, పి.విజయకుమారి, పి.సుబ్బలక్ష్మి, కె.దుర్గాబాయి, ఐ.మంగాదేవి, జి.శ్రీదేవి, టి.శ్రీదేవి, జి.అరుణకుమారి, ఎస్.కనకదుర్గ, ఎస్.దుర్గామహేశ్వరి పాల్గొన్నారు.

పి.గన్నవరం: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె 30రోజులు పూర్తికావడంతో 30వ అంకె ఆకారంలో అంగన్ వాడీలు ఒదిగి వినూత్న నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మట్టపర్తి వెంకటలక్ష్మి, కె.నాగలక్ష్మి, దొమ్మేటి లలితకుమారి, గుబ్బల వెంకటలక్ష్మి, జి.రాధ, దుర్గామల్లేశ్వరి, జి.ప్రమీల, కె.అనంత లక్ష్మీదేవి, కె.సూర్యకుమారి, ఆశాలత పాల్గొన్నారు.

మామిడికుదురు: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె 30వ రోజుకు చేరడంతో బుధవారం వారు 30అంకె ఆకారంలో ఒదిగి నిరసన తెలిపారు. డిమాండ్లు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. తమపై ప్రయోగించిన ఎస్మా చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. డిమాండ్లు పరిష్కరించే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు, ఆయాలు పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: అంగన్‌వాడీల నిరవధిక సమ్మె బుధవారం 30వ రోజుకు చేరుకుంది. కలెక్టరేట్ ఎదుట చేపట్టిన 24 గంటల నిరాహార దీక్షలు ఐదో రోజూ కొనసాగాయి. సీఐటీయూ నాయకులు భాస్కరరావు, వెంకటలక్ష్మి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. జగన్ సమస్యలను పరిష్కరించకుండా అంగన్‌వాడీలను భయభ్రాంతులకు గురిచేయడం దారుణమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.కృష్ణవేణి మాట్లాడుతూ 30రోజులుగా అంగన్‌వాడీలను రోడ్లపై కూర్చోబెట్టిన జగన్‌కు మహిళలు గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు బి.వెంకటలక్ష్మి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరామ్ మాట్లాడారు. నిరాహార దీక్షలో ఎస్ఎస్ స్వర్ణలత, బి.శ్రీలక్ష్మి, కె.భవానీ, కె.కుమారి, కె.భవిత, కె.వెంకటేశ్వరి, ఎండీ ఆసిమ్, బి.రేవతి పాల్గొన్నారు.



రామచంద్రపురం: 30వ రోజు ఆకారంలో లంచ్ బాక్స్‌లతో, 30 ఆకారంలో ఒదిగి అంగన్వాడీలు నిరసన

రామచంద్రపురం: ప్రభుత్వం ఇప్పటికైనా మొండి వైఖరి వీడి అంగన్వాడీల న్యాయమైన డిమాండ్స్ నెరవేర్చాలని, భయపెట్టాలని చూస్తే భయపడేది లేదని అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి మేడిశెట్టి దుర్గమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 30వరోజు దీక్షను కొనసాగించారు. సీపీఐ ఎంఎల్ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీలు బుధవారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. వారు తిన్న ఖాళీ లంచ్ బాక్స్‌లను 30వ రోజు ఆకారంలో పేర్చారు. అలాగే 30 అంకె ఆకారంలో ఒదిగారు. సమ్మెలో అంగన్వాడీ నాయకులు సూర్యకుమారి, విజయలక్ష్మి, శ్రీదేవి, జహరా, గొంటీదేవి, వీరవేణి, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూకల బలరాం, అంగన్వాడీలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యం

అమలాపురం టౌన్, జనవరి 10: పేదరిక నిర్మూలనే లక్ష్యంగా పాదయాత్ర చేపట్టినట్టు సీనియర్ ఐఏఎస్ అధికారి జీఎస్ ఆర్కేఆర్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. పేద వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించామని, వాటి పరిష్కారం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలతో కలిసి చట్టస భల్లోకి వెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 'ఐక్యతా విజయ పథం' పేరిట చేపట్టిన పాదయాత్ర బుధవారం అమలాపురం గడియార స్తంభం సెంటరుకు చేరుకుంది. ఈసందర్భంగా జరిగిన బహిరంగ సభలో విజయ్‌కుమార్ మాట్లాడారు. సభలో విజయ్ కుమార్ భార్య విజయశ్రీతో పాటు నాయకులు సంతోష్, వేణు గోపాల్, కృష్ణమూర్తి, సవెర, ఎస్ఆర్ భూపతి, రేవు తిరుపతిరావు, బొంతు రమణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: పేదరికం నిర్మూలనే లక్ష్యంగా ఐక్యత విజయ పథం పాదయాత్ర చేస్తున్నట్టు విశ్రాంత ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయకుమార్ అన్నారు. స్థానిక నాలుగురోడ్ల సెంటర్‌కు చేరుకున్న ర్యాలీకి పలువురు స్వాగతం పలికారు. ఐక్యత పాదయాత్ర నేటికి 125 రోజులు, 2,355 కిలోమీటర్లు కొనసాగిందన్నారు. కార్యక్రమంలో నాయకు నూకపెయ్యి చిన్న, బీర రాజారావు, వేణుగోపాల్, విజయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

'జయహో బీసీ'ని విజయవంతం చేయండి

అంతర్వేది, జనవరి 10: అంతర్వేది దేవస్థానం నుంచి మొదలయ్యే జయహో బీసీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యా రావు పిలుపునిచ్చారు. బుధవారం మోరి గ్రామంలో చెల్లుబోయిన శ్రీనివాస్ ఇంటి వద్ద జరిగిన మండల బీసీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వాన్ని గద్దెదించగల శక్తి బీసీ నాయకులకు మాత్రమే ఉందన్నారు. ఈనెల11,12,13తేదీల్లో రాజోలు నియోజకవర్గంలో నిర్వహిస్తున్న జయహో బీసీ కార్యక్రమాల్లో నియోజకవర్గ బీసీ నాయకులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కడలి వెంకటరత్నం, కౌరు శ్రీనివాస్, కొల్లు మహాలక్ష్మి, అంతర్వేది పాలెం పుల్లయ్య, వాతాడి కొండబాబు, చెల్లింగి లీలా శ్రీనివాస్, టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి విమోచన మహోత్సవం

అంతర్వేది, జనవరి 10: అంతర్వేదిపాలెం హాలోలియా గ్రౌండ్స్‌లో ఐపీసీ మినిస్ట్రీస్ 83వ విమోచన మహోత్సవాలు గురువారం నుంచి ప్రారంభమవు తాయని బిషప్ డాక్టర్ శామ్యూల్ పిన్ని తెలిపారు. ఈమహోత్సవాలకు దైవ సందేహం ఇచ్చేందుకు ప్రముఖులు విచ్చేస్తున్నారని తెలిపారు.

రైల్వేలైన్ నిర్మాణ పనుల పరిశీలన

అమలాపురం టౌన్, జనవరి 10: వైనతేయ నదిపై నిర్మాణంలో ఉన్న రైల్వే బ్రిడ్జి పనులను కోనసీమ రైల్వే సాధన సమితి ప్రతినిధుల బృందం బుధవారం పరిశీలించింది. ప్రాజెక్టు అధికారులనుప్రాజెక్టు పురోగతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. దిండి-చించినాడ, కోటిపల్లి వద్ద గౌతమి బ్రిడ్జికి సంబంధించి పిల్లర్ల నిర్మాణం తదితరవివరాలను అధికారులు వెల్లడించారు. ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, సాధన సమితి కన్వీనర్ ఇఆర్ సుబ్రహ్మణ్యం, సప్పా నాగేశ్వరరావు, బీఎస్‌మూర్తి, ఉప్పుగంటి భాస్కరరావు, పోలిశెట్టి శివాజీ, యరగర్ర వెంకటేశ్వరరావు పరిశీలించారు.

రుద్రాభిషేకం

ఆత్రేయపురం, జనవరి 10: మాసశివరాత్రి సందర్భంగా మండలంలోని రాజవరం అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శివునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపారు.

వీరేశ్వరునికి వెండి జటాజూటం బహూకరణ



అయినవిల్లి, జనవరి 10: అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వర స్వామి ఆలయ ప్రాంగ ణంలో వేంచేసి ఉన్న అన్నపూర్ణా సమేత వీరేశ్వర స్వామికి ఒక భక్తుడు వెండి, బంగారు ఆభరణాలను బుధవారం సమర్పించారు.గ్రామానికి చెందిన వంత్రపాటి శ్రీనివాసరావు, వంత్రపాటి విఘ్నేశ్వరుడు దంపతులు వీరేశ్వర స్వామికి రూ.2.50లక్షల విలువైన 3.608కిలోల వెండిజటాజూటం, అమ్మవారికి రూ.12వేలు విలువైన 2.780గ్రాముల బంగారుసూత్రాలను అందజేశారు. ఈఆభరణాలకు అర్చకులు సంప్రోక్షణచేసి పూజలు నిర్వహించి స్వామి-అమ్మవార్లకు అలంకరించారు. భక్తదంపతులకు అర్చకులు వేదాశీర్వచనం ఇవ్వగా ఛైర్మన్ గుత్తుల నాగబాబు శేషవస్త్రంతో సత్కరించి అభినందించారు.

శ్మశాన వాటికలకు స్థల సేకరణ

అమలాపురం, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఎస్సీ ఎస్టీ కాలనీల్లో శ్మశానవాటికలకు సేకరించిన స్థలాల వివరాలను పూర్తిస్థాయిలో సిద్ధం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్‌అజయ్ రెవెన్యూ అధికారులకు సూచించారు. జర్నలిస్టుల గృహ నిర్మాణ పథకానికి భూములను ఎంపిక చేయాలన్నారు. అసైన్డ్ భూములపై సంపూర్ణ ఉచిత హక్కులను లబ్ధిదారులకు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి స్థలాలు కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. యానాం భూములపై ఉచిత హక్కులు కల్పించడంపై దృష్టి సారించాలన్నారు. భూసేకరణ విభాగపు సెక్షన్ అధికారి పి.సుబ్రహ్మణ్యం, డిప్యూటీ తహసీల్దారు చినబాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

టాలెంట్ టెస్ట్ విజేతలు

మలికిపురం, జనవరి 10: లక్కవరం మంగెన గుర్రయ్య కళాశాలలో నిర్మలా ఎడ్యుకేషనల్ సొసైటీ పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన టాలెంట్ టెస్ట్‌లో పడమటిపాలెం హైస్కూలుకు చెందిన అడబాల నాగవెంకటసత్యశివాని ప్రథమ స్థానంతో రూ.5వేలు, ద్వితీయ స్థానాన్ని మేడిచర్లపాలెంవిద్యార్థిని ఎం.దుర్గాభవానీ రూ.3వేలు, మొగలికుదురు హైస్కూలు విద్యార్థి పీఎల్‌సీ రామమూర్తి తృతీయస్థానం పొంది రూ.2వేలు గెలుచుకున్నారని కరస్పాండెంట్ ఎంపీ సత్యప్రసాద్ తెలిపారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: హాయ్ నాన్న
వెంకటరమణ	: కపాలదీవి
శ్రీలలిత	: యానిమల్
శేఖర్ స్క్రీన్-1	: రాఘవరెడ్డి
శేఖర్ స్క్రీన్-2	: ఆక్వామెన్
రమా	: డెవిల్
గణపతి	: ఎక్స్‌ట్రార్డనరీ
వెంకటపద్మావతిస్క్రీన్-1	: సలార్
వెంకటపద్మావతి స్క్రీన్-2	: సలార్

ఇజ్రాయిల్‌లో ఉద్యోగ అవకాశాలు

ముమ్మిడివరం, జనవరి 10: భవన నిర్మాణ రంగంలో నిరుద్యోగులకు ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగ, అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుందని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.లోకమాన్ తెలిపారు. ప్లాస్టరింగ్, సిరామిక్, బిల్డింగ్ ఫ్రేమ్ వర్కు, ఐరెన్ బిల్డింగ్ వంటి టెక్నాలజీలో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్టు ఆయన తెలిపారు. 21 నుంచి 45ఏళ్లలోపు వారు 8వ తరగతి, ఆ పైన చదివిన అభ్యర్థులు అర్హులన్నారు. భవన నిర్మాణ రంగంలో మూడేళ్ల అనుభవం తప్పనిసరి అన్నారు. ఎంపికైన వారికి వసతి, ప్రయాణ ఖర్చులు, ఇతర సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు 9988853335 నంబరును సంప్రదించాలన్నారు.

'లీలాకృష్ణ జోలికి వస్తే తాట తీస్తాం'

మండపేట, జనవరి 10: జనసేన మండపేట నియోజకవర్గ ఇన్‌చార్జి వేగుళ్ల లీలాకృష్ణపై అర్హతలేని కొంతమంది వైసీపీ చెందిన దళితులు చేస్తున్న అసత్య ఆరోపణలను జనసేనకు చెందిన దళిత నాయకులు కొట్టిపారేశారు. తమ నేతపై నోరుపారేసుకుంటే చూస్తు ఊరుకునేదిలేదని వెలగతోడు మాజీ సర్పంచ్ సరాకులు అబ్బులు హెచ్చరించారు. ఎమ్మెల్సీ తోట దళితులకు శిరోముండనం చేసిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించిన విషయం దళితులు మరిచి ఆయనకు వంతపాడటం తగదన్నారు. ఈనియోజకవర్గంలో దళితులు మధ్య చిచ్చుపెట్టాలని చూస్తే దళితులు చూస్తు ఊరుకునేది లేదని వల్లూరు సర్పంచ్ దాసిమినా కూమారి అన్నారు. తమ నేతపై ఆరోపణలు చేసేవారి వారి తాట తీస్తామన్నారు.జనసేన నేతలు, తాతపూడి సుధీర్, మత్తా బత్తులు పుల్లయ్య, దార్ల సుధీర్, బాబు, పైడిమళ్ల సతీష్ పాల్గొన్నారు.

అమలాపురం అల్లర్ల కేసులు ఎత్తివేయడం హాస్యాస్పదం

అమలాపురం టౌన్, జనవరి 10: జిల్లా పేరు మార్పు విషయంలో జరిగిన అల్లర్ల కేసులను రాష్ట్ర ప్రభుత్వం ఎత్తివేయడం హాస్యాస్పదమని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు బత్తుల నకులరాజు ఆరోపించారు. అమలాపురం త్రిరత్న బుద్ధవిహార్‌లో బుధవారం జిల్లా కార్య వర్గ సమావేశాన్ని నకులరాజు అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేరును వ్యతిరేకిస్తూ జరిగిన అల్లర్ల కేసులను ఎత్తివేయడాన్ని పలువురు తీవ్రంగా ఖండించారు. దళితులపై బనాయించిన అక్రమ కేసులు ఎత్తేయకుండా అలా ఉంచడం దారుణమన్నారు. అనంతరం మామిడికుదురు ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గోసంగి బంగార్రాజు, బత్తుల రమేష్‌బాబు, బీఎస్ఆర్ ప్రసాద్, అంబటి త్రిమూర్తులు, ఎం.రవి, వడ్డి శ్రీనివాసరావు, గెడ్డం ప్రదీప్, మంగం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ యువజన దినోత్సవం

ముమ్మిడివరం, జనవరి 10: క్రీడలతో పిల్లలు మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఎదిగేందుకు ఎంతో దోహదాన్నిస్తాయని సీనియర్ న్యాయవాది తటవర్తి నాగరాజారావు పేర్కొన్నారు. పీపుల్ సర్వీసు ఆర్గనైజేషన్, చైతన్య వలంటరీ ఆర్గనైజేషన్‌ల ఆధ్వర్యంలో స్వామివారి వివేకానంద జయంతిని పురస్కరించుకుని జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ముమ్మిడివరం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయిలో క్రీడాపోటీలు, రంగోళి పోటీలు నిర్వహించారు. పురుషులకు వాలీబాల్, రన్నింగ్, లాంగ్ జంప్, మహిళలకు కబడ్డీ, రంగోళి పోటీలు నిర్వహించారు. ఈపోటీలను టి.నాగరాజారావు, కె.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. గెలుపొందిన క్రీడాకారులకు జనవరి 12న ఎయిమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో సీహెచ్ శ్రీనివాసరావు, ఎం.శివకుమార్, కేటీ కిశోర్, సీహెచ్ వెంకటసుధీర్, డి.నాగు, కె.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాపై ఆర్డీవో సమీక్ష

రామచంద్రపురం, జనవరి 10: ఆర్డీవో ఎస్. సుధాసాగర్ బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 10నుంచి జనవరి 9వరకు నియోజకవర్గంలో ఆయా బీఎల్‌వోల ద్వారా వచ్చిన ఫారం6,7,8ల గురించి, పెండింగ్ వివరాల గురించి చర్చించారు. రాజకీయ నాయకులు ఇచ్చిన సూచనలు, సలహాలు, ఫిర్యాదులు పరిష్కరించడానికి ఓటరు నమోదు అధికారి కార్యాలయంలో ప్రత్యేక హెల్ప్ డెస్క్ ఏర్పాటుచేస్తున్నామన్నారు. బీఎల్‌వోలు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

టీడీపీలో బీసీ, దళిత నాయకుల చేరిక



ఆలమూరు, జనవరి 10: మండలంలోని నాలుగు గ్రామాలకు చెందిన బీసీ, దళిత నాయకులు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, అమలాపురం పార్లమెంటు ఇన్‌చార్జి గంటి హరీష్‌మాధుర్ సమక్షంలో బుధవారం ఆ పార్టీలో చేరారు. ఆలమూరు, పినపళ్ల గ్రామాలకు చెందిన దళిత నాయకులు, కలవచర్ల, గుమ్మిలేరు గ్రామాలకు చెందిన బీసీ నాయకులకు పార్టీ కండువాలు కప్పి స్వాగతించారు. కార్యక్రమంలో నాయకులు కె.సునీల్‌కుమార్, వక్కపట్ల లక్ష్మణరావు, వడ్డి వెంకన్న, అముజూరి శ్రీనివాస్, ఈదల సత్తిబాబు, వంటిపల్లి సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డీఎస్పీ

రాయవరం, జనవరి 10: మండలంలోని 12గ్రామాల్లో ఉన్న పోలింగ్ స్టేషన్లను బుధవారం రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలు చుట్టూ గోడలు ఉన్నాయా, ర్యాంప్‌లు ఏవిధంగా ఉన్నాయి, పోలింగ్ స్టేషన్లలో తాగునీరు, విద్యుత్ సౌకర్యం పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ జి.నరేష్ సిబ్బంది ఉన్నారు. సంక్రాంతిని పురస్కరించుకుని గ్రామాల్లో కోడిపందాలు, గుండాట, పేకాట, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి చర్యలు తప్పవని ఎస్ఐ జి.నరేష్ హెచ్చరించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో సంక్రాంతి జరుపుకోవాలన్నారు.

మండపేట: రామచంద్రపురం డివిజన్ పరిధిలో ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు పోలీసుశాఖ చర్యలు తీసుకుంటుందని డీఎస్పీ టి.ఎస్. ఆర్‌కె. ప్రసాద్ చెప్పారు. కేశవరంలో ఆయన బుధవారం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలో పోలింగ్‌బూత్‌లు, కేంద్రాలు ఏర్పాటుపై పరిశీలిస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలోని అన్నిగ్రామాలు, పట్టణంలో ఉన్న బూత్‌లను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఎంపీపీ ఉండమట్ల వాసు, మండపేట రూరల్ ఎస్ఐ శివకృష్ణ తదితరులు వున్నారు.

కబడ్డీ, వాలీబాల్ పోటీలు ప్రారంభం

రాయవరం, జనవరి 10: రాయవరం రామయ్య జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆడుదాం ఆంధ్ర మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడపోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను ఎంపీపీ నౌడు వెంకటరమణ, ఏఎంసీ ఛైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కె.నరేంద్రరెడ్డి, సర్పంచ్‌లు చంద్రమళ్ల రామకృష్ణ, మల్లిడి సూరారెడ్డి, వాసంశెట్టి వెంకట్రావు, ఎంఈవోలు ప్రతి రామలక్ష్మణమూర్తి, యర్రమాటి సూర్యనారాయణ, పీఈటీ అప్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

అంతర్వేది, జనవరి 10: గుడిమూల, మోరి గ్రామాల్లో బుధవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని ఆయా గ్రామాల సర్పంచ్‌లు దంతులూరి వెంకటశ్రీనివాసరాజు, పసలపూడి లక్ష్మీమంగతాయారుల అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాసనగేష్ మాట్లాడుతూ 80కోట్ల మందికి రూ.2లక్షల కోట్లతో ఆహార భద్రతకై పేదలకు ఉచిత బియ్యాన్ని ప్రధాని మోదీ అందిస్తున్నారన్నారు. ఎంపీడీవో బడుగు మంగాదేవి, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు అడబాల సత్యనారాయణ, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైనేజీసెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు పాల్గొన్నారు.

108లో ప్రసవం- తల్లీబిడ్డ క్షేమం

ఆత్రేయపురం, జనవరి 10: వెలిచేరుకు చెందిన జొన్నకూటి సుజాతకు పురిటి నొప్పులు రావడంతో బుధవారం 108లో రాజమహేంద్రవరం ఆసుపత్రికి బయల్దేరారు. మార్గమధ్యంలో ఆమెకు నొప్పులు అధికం కావడంతో అంబులెన్స్‌ను పక్కన పెట్టి టెక్నీషియన్ ఎస్.రవిశేఖర్, పైలట్ కిషోర్‌బాబు మరో మహిళ సాయంతో అంబులెన్స్‌లో ప్రసవం చేశారు. మగబిడ్డ జన్మించగా ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.తర్వాత రాజమహేంద్రవరం ఆసుపత్రికి 108లో తీసుకెళ్లారు.

కోడిపందేలపై ఉక్కుపాదం

మలికిపురం, జనవరి10: సంక్రాంతిని పురస్కరించుకుని అసాంఘిక కార్యక్రమాలకు తావు లేదని ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ పేర్కొన్నారు. కోడి పందేలు, పేకాట, గుండాట వంటి కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టరీత్యా నేరమన్నారు.

ఈవోపీఆర్డీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా మల్లికార్జునరావు



అమలాపురం రూరల్, జనవరి 10: ఈవోపీఆర్డీ అసోసియేషన్ జిల్లా శాఖ సమావేశాన్ని అమలాపురం మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా జి.మల్లికార్జునరావు (అమలాపురం), ఉపాధ్యక్షురాలిగా బి.మంగాదేవి (మలికిపురం), కార్యదర్శిగా యు.నాగేంద్ర (కె.గంగవరం), కోశాధికారిగా డి.శ్రీనివాస్ (ఆత్రేయపురం), సంయుక్త కార్యదర్శిగా ఎస్ఎస్ రాజు (రామచంద్రపురం), కార్యనిర్వాహక కార్యదర్శిగా జి.భీమారావు (రాజోలు), రాష్ట్ర కౌన్సిలర్‌గా కె.కామేశ్వరరావు (కాట్రేనికోన), కార్యవర్గ సభ్యులుగా ఎం.శ్రీనివాసరావు (రాయవరం), ఎ.శ్రీనివాసరావు (మామిడికుదురు), కె.సూర్యనారాయణ (సఖినేటిపల్లి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయకలయిక

కాట్రేనికోన, జనవరి 10: చెయ్యేరు శ్రీశ్రీనివాసాఇంజనీరింగు కళాశాల పూర్వ విద్యార్థులు బుధవారం కళాశాలలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 125 మంది అనుభవాలను పంచుకున్నారు. కళాశాలకు ఉన్నతికి సహకరిస్తామన్నారు. పూర్వవిద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. కరస్పాండెంట్ డీవీఎస్ఎస్ వర్మ, ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ పరమేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు సందీప్, రమేష్‌రాజు, విద్యాధికారిణి జయలక్ష్మి, బి.రత్నరాజు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

కొత్తపేట, జనవరి 10: మందపల్లి మందేశ్వర (శనేశ్వర)ఆలయ ప్రాంగణంలో దేవదాయ శాఖ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు జరిపారు. మహిళలకు రంగవల్లులు, విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.జడ్పీటీసీ గూడపాటి రమాదేవి, సర్పంచ్ సాదు వెంకటలక్ష్మి, మాజీ సర్పంచ్‌లు చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీర వెంకటసత్యనారాయణ, గ్రంధి చంద్రరావు, సాధు చంచయ్య, తోరాటి గణేష్, ఈవో కె.విజయలక్ష్మి పాల్గొన్నారు. కొత్తపేట విద్యాబాలమందిర్‌లోవిద్యార్థులు సంప్రదాయ వస్త్రాలతోసంక్రాంతి పాటలకు నృత్యాలు చేశారు. భోగి మంటలు వేశారు. కరస్పాండెంట్ ఆర్.అనురాధ, హెచ్ఎం నూకపెయ్యి శివరత్నం పాల్గొన్నారు.